సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామ రక్ష

● వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



చిలంకూరు గ్రామంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

మద్దిపాడు: సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టబోతున్నారని ఆ పార్టీ కొండపి నియోజక వర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిలంకూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వరికూటి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన ప్రయోజనాలను వివరిస్తూ సంబంధిత బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ.. పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నూరు శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. గ్రామంలో టీడీపీ సానుభూతిపరులు ఏడుగురికి ఈ ప్రభుత్వంలో ఏకంగా రూ.5 లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని, కులం, మతం, పార్టీ అనే భేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నామనడానికి ఇదే నిదర్శనమన్నారు. దళితవాడకు వెళ్లేందుకు రహదారి కోసం తన సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చిన గ్రామస్తుడు ఎం.చంద్రమౌళిని అశోక్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. జగనన్న కాలనీలు, పింఛన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర సమస్యలను గ్రామస్తులు తెలియజేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం.. ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడిన రాజుపాలెం ఎస్టీ నాయకుడు పి.నాసరయ్యను అశోక్‌బాబు పరామర్శించారు. కార్యక్రమంలో బీవీ భాస్కర్‌రెడ్డి, ఎం.శివరామిరెడ్డి, కోటా నరసింహరావు, ఎం.చంద్రమౌళి, కె.సుబ్బారెడ్డి, టి.వెంకట్రావు, వి.మల్లికార్జునరెడ్డి, ఎ.వెంకటరెడ్డి, తాళ్ల వెంకటరెడ్డి, ఎస్‌కే శిలార్, కె.ఇబ్రాయిల్, వీరెళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మరింత అభివృద్ధి

● ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గఫార్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తిరిగి కనిగిరిలో అత్యధిక మెజార్టీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి, ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామన్నారు. నియోజకవర్గ ప్రజలంతా మంచి మనస్సుతో తనకు మద్దతునిచ్చి ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బుర్రా మధుసూదన్ యాదవ్ పాలనలో నియోజకవర్గ ప్రజలు ప్రశాంత జీవనాన్ని గడుపుతున్నారన్నారు. ప్రజల మనిషిగా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆయు రారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కాంక్షించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏపీఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, గంగసాని లక్ష్మీ, హుస్సేన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు చెరుకూరి సతీష్ చౌదరి, గాయం బలరాంరెడ్డి, తిరుపతిరెడ్డి, జి.ధనుంజయ్, పువ్వాడి రాంబాబు, వెంకట సుజాత, రషీద్, చాంద్ బాషా, ఖాదర్ బాషా, ఏసు రత్నం, నాయబ్‌రసూల్, వాసవీసత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు మేకల శ్రీను, ఓకేరెడ్డి, భవనం కృష్ణారెడ్డి, టి.సుజాత, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డీఎస్పీ ఆర్ రామాంజనేయులు, తహసీల్దార్ యు పుల్లారావు, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు,ఎంఈఓ జేప్రసాద్‌రావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక సాయిబాబా దేవస్థానంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేను సన్మానించారు.

ఘనంగా ఎమ్మెల్యే బుర్రా జన్మదిన వేడుకలు



భారీ గజమాలతో ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్తలు



ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు చెబుతున్న మున్సిపల్ చైర్మన్‌గఫార్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు

కనిగిరి రూరల్: ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధు సూదన్ యాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ భవన్‌లో నేతలు భారీగా సంబరాలు చేశారు. తొలుత బెంగళూరుకు చెందిన యువపారిశ్రామికవేత్తలు పి.రాజేష్, ఎస్ మంజునాథ్, సి.జగదీప్, కత్రి శేషవర్ధన్‌లు భారీ గజమాలతో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, లక్ష్మీ దంపతులను సన్మానించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే బుర్రా కట్ చేశారు. చైర్మన్, కౌన్సిలర్లు ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మీ, గంగసాని హుసేన్‌రెడ్డి, పామూరు మండల పార్టీ నాయకులు తెచ్చిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే బుర్రా కట్ చేశారు. పామూరు నేతలు భారీ గజమాలతో ఎమ్మెల్యే బుర్రాను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

50 అడుగుల సీఎం, ఎమ్మెల్యేల కటౌట్‌లకు పాలాభిషేకం

పార్టీ యూత్ నాయకులు రామనబోయిన శ్రీను, మీసాల శివ, జి. ధనుంజయ్, మేకల మాల్యాద్రిలు స్థానిక పామూరు రోడ్డులోని డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా గ్రౌండ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ల సుమారు 50 అడుగుల భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మీ, హుసేన్‌రెడ్డి, నాయకులు

అక్కడే ఏర్పాటు చేసిన 51 కేజీల ఎమ్మెల్యే జన్మదిన కేక్‌ను ఎమ్మెల్యే బుర్రా కట్ చేశారు. అనంతరం సీఎం, ఎమ్మెల్యేల కటౌట్ లకు పాలాభిషేకం చేశారు. స్థానిక గార్లపేట రోడ్డులోని వృద్ధాశ్రమంలో చీరలు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

హనుమంతునిపాడు: ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి,కన్వీనర్ యక్కంటి శ్రీనివాసురెడ్డి, యూత్ అధ్యక్షుడు దాసరిపల్లి సర్పంచ్ భవనం క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పుట్టినరోజును పురస్కరించుకొని నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సచివాలయాల మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బుర్రా కటౌట్‌లకు పాలాభిషేకం

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు



పొన్నలూరులో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ మాధవరావు

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ ఆరోగ్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తారన్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను బట్టి 84 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందజేస్తారన్నారు. వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు కృష్ణచైతన్య, నాగార్జున, ఈఓఆర్డీ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

చక్కని దస్తూరితో మంచి మార్కులు



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ జేడీ బ్రహ్మయ్య

కొండపి: విద్యార్థులు పరీక్షల్లో చేతి రాతను చక్కగా రాయడం ద్వారా మంచి మార్కులు పొందవచ్చని పశుసంవర్ధక శాఖ విశ్రాంత జేడీ మల్లె బ్రహ్మయ్య పేర్కొన్నారు. కొండపిలో టీజీ ఇన్నోవెటివ్ సెంటర్ ఆధ్వర్యంలో మే 17 నుంచి జూన్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత వేసవి గణిత, ఇంగ్లిష్, హిందీ శిక్షణ తరగులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు చేతి రాత, డ్రాయింగ్, జీవన గణితం, మ్యాజిక్ వెనుక లాజిక్‌ను గుర్తించడం, ఆటపాటలతో గణితం సులభంగా హిందీ నేర్చుకోవడం తదితర అంశాలు నేర్పిస్తామని నిర్వాహకులు చెప్పారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసిన సైన్స్ ఉపాధ్యాయుడు ఎల్‌వీ ప్రసాద్, కృపను అభినందించారు. కార్యక్రమంలో పెద్దకండ్లగుంట హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అహ్మద్, తిరుపతిస్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తిరునాళ్ల మహోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పట్టణంలోని కొత్తూరులో అభయాంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ కొత్తూరు నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ఆహూతులను అలరించింది. తిరునాళ్ల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తొలుత విద్యుత్ ప్రభపై తమ్మినేని సుజాత శ్రీరాములరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో, శక్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పాలన అందిస్తున్నారన్నారు.

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర సస్యశ్యామలంగా ఉందన్నారు. టీడీపీ నేతలు కుట్రపూరితంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను చేస్తున్నారన్నారు. టీడీపీ దుష్ప్రచారాలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తమ్మినేని సుజాతారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, దేవకి రాజీవ్, రాజేష్, శ్రీహరిరెడ్డి, పాతకొట్టు రమణారెడ్డి, అచ్చాల శ్రీను, దశరధరెడ్డి, చంటి, శ్రీను, సుబ్బారెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, తమ్మినేని రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీఓగా చంద్రసేన్

గుడ్లూరు: ఇన్‌చార్జి ఎంపీడీఓగా చంద్రసేన్ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డికి డీఎల్‌పీఓగా పదోన్నతి వచ్చి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో కందుకూరు మండలం వీఓపీఆర్డీగా పనిచేస్తున్న చంద్రసేన్‌కు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీపీ పులి రమేష్, ఉద్యోగులు చంద్రసేన్‌కు అభినందనలు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగార్జునరెడ్డి

సీఎస్‌పురం(పీసీపల్లి): తహసీల్దార్‌గా సీహెచ్ నాగార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఏ బాల కిషోర్‌ను వెబ్‌ల్యాండ్‌లో అక్రమాలకు పాల్పడిన కారణంగా కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈయన స్థానంలో వెలిగండ్ల తహసీల్దార్ సీహెచ్ నాగార్జునరెడ్డికి సీఎస్‌పురం తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం వీఆర్‌ఓలతో సమావేశమై రెవెన్యూ పరంగా ఎటువంటి సమస్యలు రాకుండా వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలని చెప్పారు.

పొగాకు సరాసరి ధర రూ.199

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి చిరుకూరపాడు, పంగులూరిపాలెం గ్రామాల రైతులు 997 బేళ్లు తీసుకురాగా 943 కొనుగోలయ్యాయి. 54 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.200 కాగా, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.199.30 పలికింది.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఉలవపాడు: సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరిచిపోతున్న క్రీడలను తెలియచేయాలనే ఉద్దేశంతో కుందుడుగుమ్మ పోటీలను జరిపారు. పోటీల్లో 41 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు అందచేస్తారు. ముందుగా విద్యార్థులతో గ్రంథాలయంలో నీతికథలు, శాస్త్రవేత్తలు కనిపెట్టిన అద్భుతాలు, ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన కల్పించారు. శాఖ గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

వైభవంగా గంగాభవానీ గ్రామోత్సవం



పూజలందుకుంటున్న గంగాభవాని ఉత్సవమూర్తి, బొల్లావులు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న గంగాభవానీ వార్షిక తిరునాళ్లలో భాగంగా సోమవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మేళతాళాల నడుమ గ్రామోత్సవం మోపాడు, మోపాడు బంగ్లా గ్రామాల్లో సాగింది. ముందుగా గంగాభవానీ అమ్మవారి మూల విగ్రహమూర్తికి అర్చకులు పంచామృతాభిషేకం, కుంకుమపూజతో పాటు విశిష్ట పూజలు చేశారు. ఆలయప్రాంగణంలో బొల్లావులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్పందన అర్జీలు వెంటనే పరిష్కరిస్తాం

కందుకూరు అర్బన్: స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందనలో 12 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో తమ సమస్యలను అర్జీల రూపంతో తెలియజేసి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96లో 10వ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం టంగుటూరులోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు 150 మందికిగాను 90 మంది హాజరయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా యోగక్షేమాలు తెలుసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువుల్లో మృతి చెందిన వారికి మౌనం పాటించి నివాళులర్పించారు. కొందరు గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. విద్యార్థులందరూ మనం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సంగీత

మద్దిపాడు: సచివాలయాలు లేని గ్రామాల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి వైద్యాధికారి సంగీత సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆమె సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, స్థానిక సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి విజయవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎఫ్‌డీపీ, పీఎంఎంవీవై, పీఎంఎస్‌ఎంఏ, జేఎస్‌వై, జేఈఎస్‌కే, హెల్త్ క్లినిక్ తదితర 14 రకాల వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని చెప్పారు. సర్పంచ్‌లు భాస్కర్‌రావు, కోటమ్మ, సుబ్బయ్య, తిరుపతమ్మ సీహెచ్‌ఓ సాంబశివరావు, సూపర్‌వైజర్లు రమాదేవి, శ్రీదేవి, సుచరిత అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజినీ తెలిపారు. ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3వ తరగతిలో ఎస్టీలకు 32 సీట్లు, నాల్గవ తరగతిలో 32, 5వ తరగతిలో 28, ఆరు తరగతిలో 21 సీట్లు, 7వ తరగతిలో 9 సీట్లు, 8వ తరగతిలో 9 సీట్లు, 9వ తరగతిలో 3 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు

● ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సింగరాయకొండ: ముందు వెళ్తున్న టిప్పర్ లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో మండల పరిధిలోని కలికవాయ ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన జి.వెంకట రామసుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి దంపతులు, వారి కుమారుడి కారులో తిరుపతి వెళ్తున్నారు. కారు కలికవాయ ఫ్లైఓవర్ పైకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకుని ముందు వెళ్తున్న టిప్పర్ లారీని బలంగా ఢీకొట్టాడు. కారు ముందు భాగం ధ్వంసం కాగా, రామసుబ్రహ్మణ్యం దంపతులకు గాయాలయ్యాయి. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో బెంగళూరుకు కారులో వెళ్తున్న యువకులు.. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సుబ్రహ్మణ్యంను 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఫాతిమా తెలిపారు.

భైరవకోనలో కదిరి బాబూరావు పూజలు



ప్రముఖులను సన్మానిస్తున్న భైరవకోన చైర్మన్ సిద్దు రమణారెడ్డి

సీఎస్‌పురం(పీసీపల్లి): వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు మిత్రులతో కలిసి భైరవకోనకు విచ్చేసిన ఆయన అక్కడి జలపాతాన్ని వీక్షించి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సిద్ధు రమణారెడ్డి, ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకటనర్సయ్య, పంచాగ్నుల రామమూర్తి శర్మ, సుధాకర్ శర్మలు కదిరి బాబూరావుకు స్వాగతం పలికి ఆలయాల్లో పూజలు చేపట్టారు. ఈయన వెంట తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎస్పీ సీహెచ్ సరోత్తమ్‌రెడ్డి, మాజీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం రమేష్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త టి.గిరిధర్‌రెడ్డి, అడ్వకేట్ జి మహేందర్‌రెడ్డి, కోవిలంపాడు ఉప సర్పంచ్ తీకెనం బాబూరావు, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, మన్నేపల్లి చిన్ని, బోయిన మహేంద్ర పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు యంత్ర పనిముట్లు

లింగసముద్రం: రైతుభరోసా కేంద్రాల పరిధిలో రైతులకు గ్రూపుల ద్వారా ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలను రాయితీపై అందజేస్తున్నట్లు కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ముత్యాల శేషగిరిరావు చెప్పారు. మండలంలోని పెంట్రాల, మాలకొండ్రానిపాలెం రైతు భరోసా కేంద్రం పరిధిలో . సోమవారం రైతు గ్రూపులకు రెండు ట్రాక్టర్లను, యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు గ్రూపుగా ఏర్పడితే ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి బ్యాంకు రుణంతో ట్రాక్టర్ మంజూరు చేస్తుందన్నారు. సహకార బ్యాంకు మేనేజర్ మృధుల, సూపర్‌వైజర్ టి. కొండపనాయుడు, వ్యవసాయాధికారి, అబ్రహంలింకన్, వీఏఏలు రేణుక, శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి

కొండపి: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.అనూష సూచించారు. కొండపి గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన కుటుంబ వైద్య విధానం సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందాలంటే ఇతర శాఖలకు చెందిన అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అంకయ్య, సీహెచ్‌ఓ కృష్ణంరాజు, ఎంపీహెచ్‌ఎస్ నరసింగ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశాలు పాల్గొన్నారు.

ఎంఈఓగా ప్రసాద్‌రావు బాధ్యతల స్వీకరణ

గుడ్లూరు: ఎంఈఓగా ఎంవీ ప్రసాద్‌రావు స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మండల ఇన్‌చార్జి ఎంఈఓగా చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మార్కాపురం డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్ విధులు నిర్వహించారు. చంద్రమౌళీశ్వర్ డిప్యూటీ డీఈఓగా పూర్తి బాధ్యతలు స్వీకరించి మార్కాపురం వెళ్లారు. దీంతో కనిగిరి పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎంవీ.ప్రసాద్‌రావును గుడ్లూరు ఇంచార్జి ఎంఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తు డీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌రావు మాట్లాడుతూ మండలంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.